సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

డిజిటల్

శనివారం, జూలై 20, 2024



**విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం**

- హైడ్రా ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్
- సభ్యులుగా మున్సిపల్ శాఖ మంత్రి .. రెవెన్యూ మంత్రి
- హైదరాబాద్.. రంగారెడ్డి ఇన్‌ఛార్జ్ మంత్రులు
- జీహెచ్ఎంసీ మేయర్.. సీఎస్.. డీజీపీ.. ప్రిన్సిపల్ సెక్రటరీ

2 లో

# హైడ్రా విధివిధానాలు ఖరారు



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వర్ ల్యాపింగ్ లేకుండానే పోటీ పరీక్షలను నిర్వహిస్తామని వెల్లడి
- ప్రతి అసెంబ్లీ స్థానంలో అంబేడ్కర్ నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న భట్టి
- పరీక్షల వాయిదాకు ప్రభుత్వం అంగీకరించిందన్న మల్లు రవి

3 లో

## త్వరలో జాబ్ క్యాలెండర్


- ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ
- చారాణ కోడికి బారాణ మసాలా వలె ఉందన్న కేటీఆర్
- రుణమాఫీ అయిన రైతుల కంటే కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్య
- మెజార్టీ రైతుల్లో నిరాశ మిగిల్చినందుకు సంబరాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్న

3 లో



ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్..

## ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్



## జర్నలిస్టుల సంఘం ఎన్నిక

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి ఉమ్మడి మండల కేంద్రంలోని ఏఎస్ ఫంక్షన్ హాల్ లో నూతన జర్నలిస్టుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఏనుకోవడం జరిగింది. అధ్యక్షులుగా సాయిబాబా గౌడ్, ఉపాధ్యక్షులుగా కృష్ణా, ప్రధాన కార్యదర్శిగా కాసుల శ్రీకాంత్, కోశాధికారిగా అనిల్, సంయుక్త కార్యదర్శిగా సాయిలు, గౌరవ అధ్యక్షుడు గైక్వాడ్ రాము, సలహాదారులుగా హన్మంత్ రావు, రాములును ఎన్నుకోవడం జరిగింది. సైదయ్య మాట్లాడుతూ.. సమాజంలో జరిగే ప్రతి సమస్యను తన సమస్యగా భావించి ప్రతి విలేకర్ సమాజాన్ని తెలిసేటట్టుగా వార్తలు రాసి ఆదర్శంగా నిలిచేటట్టు చూడాలని నూతన అధ్యక్షులకు కోరారు. జర్నలిస్టుల సంఘ సభ్యులు సైదయ్య, గంగాధర్, పెంటయ్య, రాజు, నవీన్, నరేష్, హైమద్ పాల్గొన్నారు.



## ప్రజల ఆశీస్సులతోనే రాజకీయంలో ఉన్నా : జిందం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల మున్సిపల్ పరిధిలోని 32వ వార్డు కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ తెలంగాణ ప్రభతో మాట్లాడుతూ 'నన్ను నమ్మిన నా ప్రజల భవితవ్యం కోసం , వార్డు అభివృద్ధి , ప్రజల అవసరాల కోసం అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరాలని సూచించిన నా వార్డు ప్రజల, మిత్రుల, శ్రేయోభిలాషుల సూచనను పరిగణలోకి తీసుకుని మీ సూచనకు అనుగుణంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని ఆయన తెలిపారు. అర్హులైన నా వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు త్వరితగతిన చేర్చి, వారి కష్టాలను తీర్చాలంటే ఖచ్చితంగా ఆ దిశగా అడుగులు వేయాల్సిందే అనే భావనతో , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా తూ.. చా .. తప్పకుండా నెరవేరుస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా నా ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించవచ్చనే ఆకాంక్షతో కాంగ్రెస్ పార్టీలో చేరాను. గత 5 సంవత్సరాల క్రితం మీ అందరి ఆశీర్వాదంతో మొదటిసారిగా రాజకీయ ఆరంగేట్రం చేసిన నన్ను మీ అందరూ అక్కున చేర్చుకొని, దీవించి వార్డు కౌన్సిలర్‌గా గెలిపించి, నాకు ప్రజా సేవ చేసే అదృష్టం కల్పించిన మీ అందరికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాను. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని దిగ్విజయంగా అమలులోకి తెస్తూ.. ప్రజాదరణ చూరగొంటుంది మన రేవంత్ రెడ్డి సర్కార్... ఇలాంటి తరుణంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నా ప్రజలకు సంపూర్ణంగా, త్వరితగతిన అందాలని భావించే అధికార పార్టీలో ఉంటేనే మరిన్ని సంక్షేమ ఫలాలు నా ప్రజలకు అందించవచ్చనే సదాలోచనతో కాంగ్రెస్ పార్టీలో చేరి, మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను' అని జిందం లక్ష్మీనారాయణ అన్నారు.

# హైడ్రా విధివిధానాలు ఖరారు

## విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

- హైడ్రా ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్
- హైడ్రా సభ్యులుగా మున్సిపల్ శాఖ మంత్రి, రెవెన్యూ మంత్రి
- సభ్యులుగా హైదరాబాద్, రంగారెడ్డి ఇన్‌ఛార్జ్ మంత్రులు
- జీహెచ్ఎంసీ మేయర్, సీఎస్, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రటరీ



**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం హైడ్రా విధివిధానాలు విడుదల చేసింది. హైడ్రా చైర్మన్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. సభ్యులుగా మున్సిపల్ శాఖ మంత్రి, రెవెన్యూ మంత్రి ఉండనున్నారు. అంతేకాకుండా.. హైదరాబాద్, రంగారెడ్డి ఇంఛార్జ్ మంత్రులు, జీహెచ్ఎంసి మేయర్, సీఎస్, డీజీపీ, ఎంఎయుడి ప్రిన్సిపల్ సెక్రటరీలు హైడ్రాలో సభ్యులుగా ఉంటారు.

**ఆర్గనైజేషన్, ఫీల్డ్ టీమ్‌లు:**

హైడ్రా అవసరమైన సబ్ డివిజన్‌లు, అవసరమైన మెటీరియల్, పరికరాలు, వాహనాలతో కూడిన ఫీల్డ్ టీమ్‌లతో తగిన సంస్థ నిర్మాణాన్ని కలిగి ఉండాలి.

**ట్రాఫిక్ సమన్వయం, నిర్వహణ:**

ట్రాఫిక్ నిర్వహణ కోసం హైడ్రా, దాని అధికారులు రెగ్యులర్ ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటారు. ముఖ్యంగా విపత్తుల సమయంలో ట్రాఫిక్‌ను నిర్వహించడానికి ప్రత్యేకంగా నీరు నిలిచిన ప్రాంతాలు, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలు, విపత్తు పీడిత ప్రాంతాలు, తుఫానుపై ట్రాఫిక్ జామ్‌లకు ప్రాధాన్యత ఇస్తారు. భారీ వర్షాల సమయంలో నీరు మొదలైనవి క్లియర్ చేయాలి.

హైడ్రాకు బడ్జెట్ ప్రభుత్వం నుండి కేటాయింపు చేస్తుంది. GHMC, HMDA, TGIIC, TGSPDCL, HMWSSB, MRDCL, HGCL, ఇతర యుటిలిటీల వంటి సంస్థలు, స్థానిక అధికారుల నుండి చందాలు, రుసుముల ద్వారా నిధులు వినియోగిస్తారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ సబ్ కమిటీ ఛైర్మన్ గా MA&UD ప్రిన్సిపల్ సెక్రటరీ, మెంబర్ కన్వీనర్ గా హైడ్రా కమిషనర్, సభ్యులుగా ప్రిన్సిపల్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, DG TG డిజాస్టర్ రెస్పాన్స్ & ఫైర్ సర్వీసెస్, HMWSSB మేనేజింగ్ డైరెక్టర్, HMDA మెట్రోపాలిటన్ కమిషనర్, GHMC కమిషనర్, HMRL మేనేజింగ్ డైరెక్టర్, TGSPDCL మేనేజింగ్ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్-ఇన్-చీఫ్, TCUR ప్రాంతంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ULBల మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్, సబ్ కమిటీ నామినేట్ చేసిన ఇతర సభ్యులు ఎవరైనా ఉంటారు.



# అమ్మమాట, అంగన్వాడి బాట

## బాచుపల్లిలో పాల్గొన్న కొలను హనుమంత్‌రెడ్డి

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** బాచుపల్లి పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర ఏండ్ల వయసు నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితులయ్యేలా అంగన్వాడి కేంద్రాలను ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని చదువు ఆరోగ్యంతో పాటు పిల్లలకు మానసిక ఉల్లాసానికి నూతన బోధన పద్ధతులతో పిల్లలను మానసికంగా దృఢంగా తయారు చేసే కేంద్రమే అంగన్వాడీ కేంద్రం అని అన్నారు. ఒకవైపు అంగన్వాడి కేంద్రాలను కొత్త విధానంలో తీసుకురావడంతో పాటు వాటి బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అదేవిధంగా గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలు తెలియజేసే కార్యక్రమమే అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి ప్రభుత్వం స్వీకారం చెప్పిందన్నారు. అనంతరం గర్భిణీలకు తల్లులకు పిల్లలకు పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను కృష్ణారెడ్డి, సీతారాం రెడ్డి, యుద్ధం రెడ్డి, సత్తిరెడ్డి, ఏ శంకర్, కె నారాయణ, బాల్ రెడ్డి, రామచంద్రనాయక్, హరి నాయక్, శంకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, వీరారెడ్డి, వెంకటేష్ పటేల్, నవీన్, జీతూ, రాజేందర్, సాయిరాజ్, మురళీ, ప్రశాంత్ రెడ్డి, కే లచ్చిరెడ్డి, కే వీరారెడ్డి, జితేందర్ రెడ్డి, పరమేష్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- హస్తం పార్టీ తీర్థం పుచుకున్న కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య
- ఆరుగురు కౌన్సిలర్లు

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపా దాస్ మున్షి, వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కోరుట్ల పట్టణ మున్సిపల్ చైర్మన్, ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన నుంచి సీఎం రేవంత్ రెడ్డి సమర్థ నాయకత్వంలో ఆరు గ్యారంటీల అమలు, రెండు లక్షల రుణమాఫీ అమలు, పలు విప్లవాత్మక నిర్ణయాలు, తదితర అంశాల ప్రాతిపదికగా, కాంగ్రెస్ పట్ల ఆకర్శితులై కోరుట్ల పట్టణ సర్వతో ముఖాభివృద్ధి కోసం కృషి చేసేందుకు కోరుట్ల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య, కోరుట్ల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు యాటం పద్మ, సజ్జు భాయ్, గంధం గంగాధర్, బద్దీ సుజాత మురళి, జిందం లక్ష్మీనారాయణ, ఫర్ హాత్ బేగం, అబ్దుల్ రహీమ్ గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



# ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్..

# ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఏడు నెలలు ఏమార్చి చేసిన రుణమాఫీ
- చారాణ కోడికి బారాణ మసాలా వలె ఉందన్న కేటీఆర్
- రుణమాఫీ అయిన రైతుల కంటే కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్య
- మెజార్టీ రైతుల్లో నిరాశ మిగిల్చినందుకు సంబరాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్న

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** రుణమాఫీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఇంతకాలం అటెన్షన్ డైవర్షన్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఫండ్స్ డైవర్షన్ చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. 'సీఎం గారు... ఊరించి.. ఊరించి.. ఏడునెలలు ఏమార్చి చేసిన.. మీ రుణమాఫీ తీరు చూస్తే.. తెలంగాణ ప్రజలకు గుర్తొచ్చిన సామెత ఒక్కటే.. చారాణ కోడికి..! బారాణ మసాలా...!!' అన్నట్లుగా ఉందన్నారు. రుణమాఫీ అయిన రైతుల కన్నా కంటతడి పెట్టిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు.. రైతుమాఫీ పథకానికి మరణ శాసనాలు అయ్యాయన్నారు. అన్నివిధాలా అర్హత ఉన్నా.. ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పేటోడు లేడన్నారు. రైతులు గోడు చెప్పుకుందామంటే వినేటోడు కూడా లేడన్నారు. అర్హులైన లబ్ధిదారులు.. రుణమాఫీ కాక.. అంతులేని ఆందోళనలో ఉంటే ఎందుకీ సంబరాలు? అని ప్రశ్నించారు. నలభై లక్షల మందిలో.. మెజారిటీ రైతులకు నిరాశే మిగిల్చినందుకా? ముప్పై లక్షల మందిని మోసం చేసినందుకా? ఈ సంబరాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సీజన్లు అయినా.. రైతు భరోసా ఇంకా షురూ చెయ్యలేదని... జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా.. జూలై వచ్చినా రైతుల ఖాతాలో వేయలేదన్నారు. కౌలు రైతులకు.. ఇస్తానన్న రూ.15 వేలు ఇయ్యలేదని మండిపడ్డారు. రైతు కూలీలకు.. రూ.12 వేల హామీ ఇంకా అమలు చేయలేదన్నారు. మభ్యపెట్టే మీ పాలన గురించి.. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇదివరకు అటెన్షన్ డైవర్షన్, ఇప్పుడేమో ఫండ్స్ డైవర్షన్ అన్నారు.





## హర్షవర్ధన్ కు ఘన సన్మానం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన గణపతి హర్షవర్ధన్ రాజు అండర్ 12 రన్నింగ్ పోటీలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ హర్షవర్ధన్ లాంటి విద్యార్థి నేటి యువతరానికి ఆదర్శప్రాయమని, మారుమూల గ్రామమైన చిట్టాపూర్ నుండి రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచడం చాలా సంతోషించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సురిగి శ్రీనివాస్‌గౌడ్, రాజేష్ బంటి, షెను భాయ్, విష్ణువర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక పారాయణం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల శ్రీసాయిరామ దేవాలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకొని సామూహిక శ్రీసాయి సచ్చరిత్ర పారాయణ సప్తాహ పారాయణ మహా యజ్ఞంలో భాగంగా రెండవ శుక్రవారం నిత్య దేవతారాధన ఆవాహిత మండపారాధన మరియు స్వామివార్లకు ఫల, పంచామృతాభిషేకాలు, వాసవి మహిళా సంఘం వారిచే సామూహిక లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం, లలితా సహస్రనామ స్తోత్ర హోమము ఘనంగా నిర్వహించడం జరిగిందని దేవాలయ కార్య నిర్వాహణాధికారి కాంతా రెడ్డి తెలిపారు.



## త్వరలో జాబ్ క్యాలెండర్

### డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** త్వరలో ఉద్యోగ ఖాళీలపై జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఓవర్ ల్యాపింగ్ లేకుండానే పోటీ పరీక్షలను నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ప్రతి అసెంబ్లీ స్థానంలో అంబేడ్కర్ నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

సచివాలయంలో గ్రూప్–2 అభ్యర్థులతో పరీక్షలపై చర్చించారు. విద్యార్థుల డిమాండ్ మేరకు గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి ఫోన్ చేసి డిసెంబర్‌లో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించడాన్ని పరిశీలించాలన్నారు. మరోవైపు, గ్రూప్ 2, 3 పరీక్షల వాయిదాకు ప్రభుత్వం అంగీకరించిందని ఎంపీ మల్లు రవి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం త్వరలో తేదీని ప్రకటిస్తుందన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రూప్ 2 పరీక్షలు ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరగాల్సి ఉంది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం వాయిదా వేసింది.

## ఎత్తోండలో రైతు రుణమాఫీ సంబరాలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల పరిధిలోని ఎత్తోండ గ్రామంలో శుక్రవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సిఎం, వ్యవసాయ శాఖ మంత్రి, శాసనసభ్యులు పోచారం తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.అనంతరం టపాకాయలు పేల్చి రైతులకు మిఠాయిలు పంచిపెట్టారు. గ్రామ అధ్యక్షులు షేక్ తయ్యుబ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతులకు అండగా నిలబడే పార్టీ అని కొనియాడారు .ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని అమలు చేసిందని రైతులకు తెలిపారు. మా గ్రామ రైతుల తరపున సీఎం రేవంత్ రెడ్డికి వ్యవసాయ మంత్రికి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రో చైర్మన్ కు ప్రత్యేక కృతజ్ఞత ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్.ఏ. ఖాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అగ్గు లింగయ్య బోనికే గంగాధర్ యూత్ అధ్యక్షులు షేక్ రఫీ సాయిబాబు చందూరు సాయిలు కోటగిరి మండల మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ మాజిద్ నిజామాబాద్ గంగారం శోభి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.





## చెరువులో పడి వ్యక్తి మృతి

**తెలంగాణ ప్రభ (నర్సాపూర్) :** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. పోలీసుల వివరాల ప్రకారం చింతల్ చెరువు గ్రామానికి చెందిన అంబటి రమేష్(29) గురువారం సాయంత్రం ఇంటి నుంచి అంబటోల చెరువు కుంటకు చేపల కాపరికి వెళ్లాడని, మరుసటి రోజు శుక్రవారం వరకు ఇం టికి తిరిగి రాకపోవడంతో చెరువు కుంటకు వెళ్లి చూసేసరికి అతని బైక్ అక్కడే ఉండడం గమనించి గజ ఈతగాలతో కుంటలో గాలించగా శవం లభ్యమయింది. మృతుడికి మూడు నెలల క్రితం వివా హం జరిగిందని, మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

## వాసవీమాత దేవాలయంలో శాఖంబరిగా దర్శనం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కోరుట్ల పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత దేవాలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారిని శాఖాంబరి దేవిగా వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో రామ్‌శర్మ పంతులు, మోటూరి రాజేంద్రప్రసాద్, నీలి సంతోష్, శ్రీకాంత్, కంటాల భాస్కర్, కోటగిరి శైలజ భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## అందుకే వివాహానికి దూరంగా ఉన్న

ప్రముఖ వ్యాపారవేత్త, మన దేశ శ్రీమంతుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ - రాధిక మర్చంట్ వివాహం ఈ నెల 12న ముంబైలో అంగరంగ వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వివాహానికి దేశ, విదేశాల నుంచి ఎందరో ప్రముఖులు హాజరయ్యారు. హాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ తో పాటు వివిధ సినీ రంగాలకు చెందిన స్టార్లు తరలి వచ్చారు. అయితే కొందరు సినీ తారలు మాత్రం ఈ పెళ్లికి దూరంగా ఉన్నారు. వీరిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అనంత్ అంబానీ పెళ్లికి ఎందుకు వెళ్లలేదనే ప్రశ్న తాప్సీకి ఎదురయింది. ఈ ప్రశ్నకు ఆమె స్పందిస్తూ... అంబానీ కుటుంబంతో తనకు ఎలాంటి అనుబంధం లేదని తెలిపింది. వ్యక్తిగతంగా వారితో తనకు పరిచయం లేదని చెప్పింది. ఎవరి పెళ్లికైనా వారితో పరిచయం ఉంటేనే తాను వెళ్తానని తెలిపింది. పెళ్లి అనేది పూర్తిగా వారి వ్యక్తిగత అంశమని చెప్పింది.

